# నవంబర్ 19న సిద్దిపేటలో సీఎం రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభ

## ఇందిరమ్మ కుటుంబ బీమా, ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభించనున్న సీఎం
## సిద్దిపేట సభను విజయవంతం చేయాలి :మంత్రులు
## ఆరు గ్యారెంటీలు, సంక్షేమ పథకాల అమలును ప్రజలకు వివరించనున్న ముఖ్యమంత్రి
## సభా స్థలి, ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్



**విశ్వంభర, సిద్దిపేట:** నవంబర్ 19న ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు మంత్రులు డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ సభ వేదికగా రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటా ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించడంతో పాటు మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.సిద్దిపేటలో సీఎం సభా స్థలి, ఏర్పాట్లను మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున వాహనాల పార్కింగ్, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు, రాకపోకలకు అనువైన ప్రాంతాలు, సభ నిర్వహణకు అనుకూలమైన ప్రదేశాలపై పలు ప్రాంతాలను పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలు, నూతన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే సిద్దిపేట సభ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం పేద, సామాన్య కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమని, పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని తెలిపారు.అలాగే, 20 లక్షల మంది విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ అమలు చేస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానిదని తెలిపారు. సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. సిద్దిపేట సభ వేదికగా ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు బోనస్, రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాల అమలు వివరాలను సభలో వెల్లడించనున్నట్లు తెలిపారు.మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన అంశంతో పాటు ఉద్యోగ నియామకాలు, పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పూర్తి వంటి కార్యక్రమాలపై కూడా ముఖ్యమంత్రి ప్రజలకు వివరిస్తారని తెలిపారు. ప్రభుత్వం సాధించిన విజయాలతో పాటు ఇంకా అమలు చేయాల్సిన కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణను కూడా ప్రజలకు తెలియజేయనున్నట్లు వెల్లడించారు.ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ పాలన కొనసాగిస్తోందన్నారు.నవంబర్ 19న సిద్దిపేటలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు సిద్దిపేటతో పాటు దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్, మానకొండూర్, సిరిసిల్ల తదితర నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని మంత్రులు పిలుపునిచ్చారు.సభ ఏర్పాట్ల పరిశీలనలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ హైమావతి, నియోజకవర్గ ఇంచార్జీలు పూజల హరికృష్ణ, చెరుకు శ్రీనివాస్ రెడ్డి, కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# 13 లేదా 14న హైదరాబాద్‌కు రాహుల్ గాంధీ

## 'భారత్ సమ్మిట్' సహా గిగ్ వర్కర్ల సమావేశంలో పాల్గొననున్న రాహుల్ గాంధీ
## 70 దేశాల ప్రతినిధులతో ప్రతిష్టాత్మకంగా అంతర్జాతీయ సదస్సు
## రాహుల్‌తో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అరగంట పాటు కీలక భేటీ
## నవంబర్‌లో నామినేటెడ్ పోస్టుల భర్తీ పూర్తి: మహేష్ కుమార్ గౌడ్



నవంబర్‌లో నామినేటెడ్ పోస్టుల భర్తీ..

**న్యూఢిల్లీ:** లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ నెల 13 లేదా 14వ తేదీల్లో హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. నగరంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'భారత్ సమ్మిట్' తో పాటు గిగ్ వర్కర్లతో ఏర్పాటు చేయనున్న ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొంటారు. మంగళవారం ఢిల్లీలోని జన్‌పథ్ నివాసంలో రాహుల్ గాంధీతో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అరగంట పాటు కీలకంగా సమావేశమయ్యారు.

భేటీ అనంతరం మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ సమావేశ వివరాలను వెల్లడించారు. తెలంగాణలో బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ సంస్థాగతంగా చేపడుతున్న కార్యక్రమాలపై రాహుల్ గాంధీకి సమగ్ర నివేదిక అందించినట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో ఓబీసీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టడం, ఓబీసీల ప్రాతినిధ్యం తదితర అంశాలపై లోతుగా చర్చించామన్నారు. హైదరాబాద్‌లో గిగ్ వర్కర్లతో సమావేశం నిర్వహించాలని రాహుల్ సూచించారని, ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చిందని గుర్తుచేశారు.

**70 దేశాల ప్రతినిధులతో భారత్ సమ్మిట్..**

హైదరాబాద్‌లో జరగనున్న భారత్ సమ్మిట్ ఒక ప్రతిష్టాత్మక అంతర్జాతీయ కార్యక్రమమని టీపీసీసీ చీఫ్ పేర్కొన్నారు. ఈ సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 70 దేశాల నుంచి ప్రతినిధులు, ఢిల్లీ నుంచి పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలు హాజరుకానున్నారని తెలిపారు. సార్వత్రిక ప్రజాస్వామ్యం, కీలక అంతర్జాతీయ అంశాలపై ఇందులో చర్చలు జరుగుతాయన్నారు. గత ఏడాది జరిగిన సమ్మిట్‌కు సుమారు 100 మంది ప్రతినిధులు రాగా, రాహుల్ గాంధీ కూడా పాల్గొన్నారని, ఈ ఏడాది సదస్సు కూడా విజయవంతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలోని నేతల మధ్య విభేదాలు, అంతర్గత పంచాయితీలపై రాహుల్ గాంధీతో ఎలాంటి చర్చ జరగలేదని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఆ వ్యవహారాలను ఏఐసీసీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పర్యవేక్షిస్తారని తెలిపారు. హైదరాబాద్‌లో 'సర్' కు వ్యతిరేకంగా నిర్వహించే సభతో పాటు మెగా బీసీ ర్యాలీకి రాహుల్ గాంధీని ఆహ్వానించామని, వాటి తేదీలు ఇంకా ఖరారు కాలేదని చెప్పారు. నవంబర్ నెలలోనే నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించారు. అలాగే, సోనియా గాంధీ ఆత్మకథను స్వాగతిస్తున్నామని, ఆ పుస్తకంపై తెలంగాణలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు.

**మన్మోహన్ సింగ్ మెమోరియల్ పార్క్ పుస్తకం అందజేత..**

ఈ సమావేశం సందర్భంగా మాజీ ప్రధాని, ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ జ్ఞాపకార్థం తెలంగాణ ప్రభుత్వం, హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో నిర్మించిన మెమోరియల్ పార్క్‌కు సంబంధించిన ప్రత్యేక పుస్తకాన్ని మహేష్ కుమార్ గౌడ్ రాహుల్ గాంధీకి అందజేశారు.

# కుమారుడి పెండ్లి పత్రికలు ఆలయాల్లో పెట్టి, పూజలు నిర్వహించిన జగ్గారెడ్డి దంపతులు

## రుద్రారంలోని గణేష్ గడ్డ వినాయక ఆలయంలో తొలి పత్రిక పెట్టి పూజలు నిర్వహించిన జగ్గారెడ్డి, నిర్మల
## ?ఆలయాల్లో పూజలు చేసి.. బ్రాహ్మణుల ఆశీర్వచనాలు తీసుకున్న తూర్పు భరత్ సాయి రెడ్డి
## 16 ఆలయాల్లో పత్రికలు పెట్టి, పూజలు చేసిన జగ్గారెడ్డి కుటుంబసభ్యులు

**విశ్వంభర, సంగారెడ్డి:**

తమ కుమారుడు తూర్పు భరత్ సాయి రెడ్డి వివాహం ఈ నెల 25న జరగనున్న నేపథ్యంలో జగ్గారెడ్డి, నిర్మల దంపతులు తమ కుమారుడిని వెంట బెట్టుకొని ఆలయాలకు వెళ్లారు. పెళ్లి పత్రిక దేవుళ్ళు, అమ్మవార్ల సన్నిధిలో పెట్టి పూజలు నిర్వహించారు.తొలి పత్రికను రుద్రారంలోని గణేష్ గడ్డ ఆలయంలో పెట్టి పూజలు నిర్వహించారు. ఆ తర్వాత సంగారెడ్డిలోని అస్తబల్ రేణుక ఎల్లమ్మ ఆలయం, నల్ల పోచమ్మ ఆలయం, సంగమేశ్వర ఆలయం, భవానీ మందిరం, మాణిక్ ప్రభు మందిర్, లక్ష్మి నరసింహ స్వామి ఆలయం, దుర్గమ్మ గుడి, ముత్యాలమ్మ గుడి, వడ్డె వీర హనుమాన్ మందిర్, శ్రీ వైకుంఠ పురం ఆలయం, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం, నవరత్నాలయం, ఎర్ర పోచమ్మ గుడి, రామ్ నగర్, రామ్ మందిర్... ఇలా మొత్తం 16ఆలయాల్లో పత్రికలు పెట్టి.. పూజలు నిర్వహించారు తాత - నానమ్మ ఫోటో వద్ద పత్రిక పెట్టి..తల్లిదండ్రుల కాళ్లకు నమస్కరించిఆలయాల్లో పత్రికలు పెట్టి పూజలు చేసిన అనంతరం జగ్గారెడ్డి దంపతులు రామ్ నగర్ లోని తమ ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా తూర్పు భరత్ సాయిరెడ్డి తమ తాత-నానమ్మ చిత్రపటానికి నమస్కరించి, పెళ్లి పత్రికను ఫోటో వద్ద పెట్టారు. ఆ తర్వాత ఇంట్లోని పూజా మందిరంలో దేవతా విగ్రహాలకు నమస్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తల్లిదండ్రుల కాళ్లకు నమస్కరించి తూర్పు భరత్ సాయి రెడ్డి వాళ్ల ఆశీస్సులు అందుకున్నారు.



# సమతామూర్తి ప్రాంగణంలో విష్ణు సహస్రనామపారాయణం.. గిన్నిస్ వరల్డ్ రికార్డు



**విశ్వంభర, హైదరాబాద్:** దైవ కార్యాలకు ప్రతి ఒక్కరూ సమయాన్ని వెచ్చించాలని చిన జీయర్ స్వామి పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లోని శ్రీరామనగరంలో 70వ తిరునక్షత్ర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం మూడో రోజున నిర్వహించిన తీర్థగోష్ఠి, నరసింహ స్వామి ప్రార్థన, హారతిలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జానపద కళాకారులు, సంకీర్తన మండలి బృందాల ఆటపాటలు ఆకట్టుకున్నాయి. జీవ పరిశోధన విభాగం ఆధ్వర్యంలో ముద్రించిన పుస్తకాలను జీయర్ స్వామి ఆవిష్కరించారు. ప్రపంచ రికార్డును నెలకొల్పేలా భక్తులు.. సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. అ అద్భుత ఘట్టాలను పరిశీలించిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ ప్రతినిధి.. జీయర్‌స్వామికి ప్రశంస పత్రాన్ని అందజేశారు. సామాజిక సేవలందిస్తున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత డా.ఎ.ఎస్.నారాయణతో పాటు సామాజిక కార్యకర్తలను సన్మానించారు. అహోబిల జీయర్ స్వామి, దేవనాధ జీయర్ స్వామి, మైహోం గ్రూప్స్ ఛైర్మన్ జూపల్లి రామేశ్వరరావు, జీయర్ సంస్థల సలహాదారు ఎర్నేని రామారావు పాల్గొన్నారు.

# శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టుల అనుమతుల వివరాలివ్వండి: ఏపీ, తెలంగాణకు కేఆర్ఎంబీ లేఖ

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:**




శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు సంబంధించి అసలు అనుమతుల వివరాలు సమర్పించాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కృష్ణానదీ యాజమాన్య బోర్డు తెలిపింది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు కేఆర్ఎంబీ లేఖలు రాసింది. ప్రాజెక్టుల అసలు రూపకల్పన, నీటి వినియోగం, కాల్వల సామర్థ్యం, ఆయకట్టు వివరాలతో పాటు ఆ తర్వాత చేపట్టిన మార్పులు, అదనపు నీటి అవసరాల వివరాలు ఇవ్వాలని కోరింది. కేంద్ర జలశక్తి శాఖ సూచనల మేరకు మొదట ఆమోదించిన ప్రాజెక్టు వివరాలనే ప్రామాణికంగా తీసుకొని తదుపరి మార్పులను పరిశీలించనున్నట్లు పేర్కొంది. శ్రీశైలం ప్రాజెక్టులో 11, నాగార్జునసాగర్‌లో రెండు అనుమతి లేని భాగాలు ఉన్నట్లు 2021 నాటి నోటిఫికేషన్‌లో కేంద్రం ప్రస్తావించిందని గుర్తు చేసింది. ఈ మార్పులకు సంబంధించిన సాంకేతిక అనుమతులు, కేంద్ర సంస్థల క్లియరెన్స్ వివరాలను కూడా సమర్పించాలని నవంబర్ 6న జారీ చేసిన లేఖలో రెండు రాష్ట్రాలను కోరింది. గతంలో సెప్టెంబర్ 21, అక్టోబర్ 1, అక్టోబర్ 16, అక్టోబర్ 30 తేదీల్లో రాసిన లేఖలకు సంబంధించిన వివరాలు కూడా ఇంకా అందలేదని లేఖలో కేఆర్ఎంబీ పేర్కొంది.2016 కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్ కేటాయింపులు, మొదట ఆమోదించిన ప్రాజెక్టు రూపకల్పనలే ప్రాథమిక ప్రాతిపదికగా కొనసాగుతాయని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ అక్టోబర్ 15న స్పష్టం చేసినట్లు బోర్డు తెలిపింది. ప్రాజెక్టుల పరిధిలో ఆ తర్వాత చేసిన మార్పులు, అదనంగా చేర్చిన పథకాలు, నీటి అవసరాల పెంపు వంటి అంశాలను పరిశీలించేందుకు అసలు అనుమతుల వివరాలు అవసరమని తెలిపింది. అందుకోసం రెండు ప్రాజెక్టులకు సంబంధించి మొదట అనుమతి పొందిన పరిధి, భాగాలు... ఎడమ, కుడి కాల్వల ద్వారా నీటి మళ్లింపు వివరాలు... నీటి వినియోగం, డిజైన్ అవసరాలు... ఆయకట్టు పరిధి, సాంకేతిక అనుమతుల పత్రాలు ఇవ్వాలని సూచించింది. రాష్ట్రాల హక్కులు, వాదనలకు భంగం కలగకుండా ఈ వివరాలు సేకరిస్తున్నట్లు కృష్ణా బోర్డు స్పష్టం చేసింది.

## యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు రూ.50 లక్షల విరాళం
## దాతలు ముందుకు రావడం సంతోషం: డిజిపి సి. వి. ఆనంద్
### పోలీసు కుటుంబాల పిల్లల విద్యాభివృద్ధికి చేయూత: ఆప్టిమస్ గ్రూప్ ఛైర్మన్ డి. శ్రీనివాసరెడ్డి




**విశ్వంభర, హైదరాబాద్:** యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో విద్యా మౌలిక వసతుల అభివృద్ధికి ఆప్టిమస్ గ్రూప్ ఛైర్మన్, మేనేజింగ్ పార్ట్‌నర్ డాక్టర్ డి. శ్రీనివాసరెడ్డి రూ.50 లక్షల విరాళం అందించారు. మంగళవారం మైండ్ స్పేస్ లోని పెరెల్ క్లబ్ లో నిర్వహించిన ఓపెన్ హౌస్ సమావేశం లో డీజీపీ సీవీ ఆనంద్‌కు విరాళం చెక్కును అందజేశారు.ఈ నిధులను పాఠశాలలో తరగతి గదులు, సైన్స్, టెక్నాలజీ ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్రీడా వసతులు, డిజిటల్ విద్యా సదుపాయాల అభివృద్ధికి వినియోగించనున్నారు. పోలీసు సిబ్బంది పిల్లలతోపాటు సాధారణ ప్రజల కుటుంబాలకు చెందిన పిల్లలకు సైతం సమాన ప్రాతిపదికన నాణ్యమైన విద్యను అందించడమే ఈ పాఠశాల లక్ష్యం.విరాళం అందించిన డాక్టర్ శ్రీనివాసరెడ్డిని డీజీపీ సీవీ ఆనంద్ ఈ సందర్భంగా అభినందించారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో అత్యుత్తమ విద్యా ప్రమాణాలు నెలకొల్పేందుకు పారిశ్రామిక, వాణిజ్య సంస్థలు, దాతలు ముందుకొచ్చి సహకారం అందించాలని ఆయన సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, క్రీడలు, ఇతర రంగాల్లోనూ మెరుగైన అవకాశాలు కల్పించేలా పాఠశాలను అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. పోలీసులంటే తనకు ఎంతో గౌరవమని, సమాజ భద్రత కోసం వారు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. పోలీసు కుటుంబాల పిల్లల విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విద్య ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, ఎస్ఎస్సీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, ఐటీ రంగానికి చెందిన సంస్థలు, ఆర్టీసీ, ఇతర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కోదండరాములు దంపతుల స్వర్ణోత్సవ వేడుకలు

**విశ్వంభర, హనుమకొండ :**



విశ్వబ్రాహ్మణ జాతిరత్నం మద్దోజు కోదండరాములు, ప్రభావతి దంపతుల 50వ వివాహవార్షికోత్సవం, కోదండ రాములు 75వ జన్మదిన వేడుకలను కుటుంబ సభ్యులు హనుమకొండలో ఘనంగా నిర్వ హించారు. అమెరికాలో స్థిరపడిన పెద్ద కుమారుడు శ్రీకర్, కోడలు నిషా, హైదరాబాద్‌లో ఉంటున్న చిన్న కుమారుడు శ్రీహర్ష, కోడలు స్రవంతి, కుమార్తె శ్రావణి, అల్లుడు రాజుతో పాటు బంధుమిత్రులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వియ్యంకుడు కుందారం గణేష్ ఆచారి మాట్లాడుతూ.. పోస్టల్ శాఖలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ అనంతరం కూడా ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ పలువురికి అండగా నిలుస్తున్న కోదండరాములు ఆదర్శప్రాయులని కొనియాడారు. సంఘ సంస్కర్తగా సమాజానికి సేవలందిస్తూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. భార్య ప్రభావతి కూడా భర్తకు అండగా నిలుస్తూ కుటుంబాన్ని అన్యోన్యంగా తీర్చిదిద్దారని అన్నారు. విశ్వబ్రాహ్మణ నిత్య అన్నదాన సత్రం, యాదగిరిగుట్ట సత్రం సేవా కార్యక్రమాల్లోనూ కోదండరాములు భాగస్వామిగా ఉంటున్నారని తెలిపారు. నలుగురు సోదరుల కుటుంబం శ్రీరామచంద్రుని నామాలతో ఆదర్శవంతమైన జీవనాన్ని కొనసాగిస్తోందన్నారు. ఈ సందర్భంగా కాలనీ పెద్దలు కోదండరాములు సామాజిక సేవలను ప్రశంసించి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

## చదువుతో పాటు సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలి



**విశ్వంభర, బాగ్‌లింగంపల్లి :**విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొనాలని జవహర్ బాల్ మంచ్ జాతీయ చైర్మన్ జీవి హరి, రాజ్యసభ సభ్యుడు మందాడి అనిల్ కుమార్ యాదవ్ సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలు పిల్లల్లో జ్ఞాపక శక్తి, ఆత్మవిశ్వాసం, సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు చదువుపై ఆసక్తిని పెంచుతాయని పేర్కొన్నారు. కళారంగంలోనూ భవిష్యత్తులో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, చిన్నతనం నుంచే తమలోని ప్రతిభను గుర్తించి అభివృద్ధి చేసుకోవాలని ఆకాంక్షించారు. నవంబర్ 14 బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ అనుబంధ సంస్థ జవహర్ బాల్ మంచ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక వేడుకల్లో భాగంగా మంగళవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. రాష్ట్ర చైర్మన్, న్యాయవాది మామిడి రిషికేష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు జీవి హరి, మందాడి అనిల్ కుమార్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్ సునీల్ యాదవ్, కోఆర్డినేటర్లు కిరణ్, విధుర్, అభిషేక్, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆంటోనీ, ఖైరతాబాద్ జిల్లా చైర్మన్ జాషువా తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీ విత్తనాల పంపిణీ లో సర్పంచ్ అక్రమాలు...
## తాను చెప్పిందే వేదం
## చెప్పిన రైతులకే సబ్సిడీ వేరు శనగ ఇవ్వాలి
## వ్యవసాయ అధికారులకు డిండి సర్పంచ్ హుకుం...

విశ్వంభర, డిండి :- ప్రభుత్వం రైతులకు రాయితీపై సరఫరా చేసిన సబ్సిడీ విత్తనాల పంపిణీలో డిండి గ్రామ సర్పంచ్ పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అర్హులైన పేద రైతులకు విత్తనాలు అందకుండా తమ అనుచరులకు ఇవ్వాలని వ్యవసాయ అధికారులకు హుకుం జారీ చేస్తునన్నారు డిండి సర్పంచ్.

ఒకే కుటుంబంలో నలుగురికి సబ్సిడీ విత్తనాలు కట్టబెట్టారని గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితులు మరియు గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం సీజన్ నిమిత్తం ప్రభుత్వం నుంచి గ్రామానికి వచ్చిన సబ్సిడీ వేరుశనగ విత్తనాలను సర్పంచి తన సొంత నిర్ణయాలతో పక్కదారి పట్టించారు. అధికారులు చేతులెత్తేశారని అదే విత్తనాలను సర్పంచ్ అనుచరులకు మరియు దళారులకు విక్రయించారని రైతులు ఆరోపిస్తున్నారు.

డిండి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై ఇస్తున్న వేరుశనగ విత్తనాలు పంపిణీ విషయంలో అవకతవకలు జరిగాయి.రైతులు ప్రభుత్వం నుండి సబ్సిడీ పల్లి వస్తుందని ఎదురుచూస్తున్నారు. కానీ ఆ పల్లి మరి కొంతమందికి ఒకే కుటుంబం లో నలుగురికి,ముగ్గురు కి భూమిని కౌలుకు ఇచ్చిన వారికి సబ్సిడీ పల్లి ఎలా ఇచ్చారని అర్హులైన రైతులు ఆందోళన చెందుతున్నారు.గత సంవత్సరంలో ఇచ్చిన వారికి ఈ సంవత్సరం కూడా పల్లి ఇచ్చారు.వ్యవసాయఅధికారి రేహన ను వివరణ కోరగా మాకు ఏ సంబంధం లేదని, సర్పంచి పదిమంది పేర్లు పంపిస్తే వారికే సబ్సిడీ పల్లి ఇవ్వమన్నారు.నేను చెప్పిన వారికే సబ్సిడీ పల్లి ఇవ్వాలని తెలిపినట్లు వెల్లడించారు.సర్పంచి చెప్పిందే వేదం ఏ అధికారైన నేను చెప్పినట్టే నడుచుకోవాలని ఆదేశాలు జారిచేయడం మూలంగా అర్హులైన రైతులు తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

## ఎలుగుబంటిపై పెద్దపులి దాడి.. ప్రత్యక్షంగా వీక్షించిన పర్యాటకులు



విశ్వంభర, నల్లమల: నల్లమల అడవిలో స్వేచ్ఛగా తిరుగుతున్న ఎలుగుబంటిపై పెద్దపులి దాడి చేసిన ఘటన సామాజిక మాధ్య మాల్లో వైరల్‌గా మారింది. నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ అడవి ప్రాంతంలో సఫారీకి వెళ్లిన పర్యాటకులకు ఆసక్తికర, ఉత్కంఠభ రితమైన సన్నివేశం ఎదురైంది. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో సఫారీ కోసం వెళ్తున్న ప్రయా ణికుల ముందు నుంచి పులిదాడిలో గాయ పడిన ఎలుగుబంటి అరుచుకుంటూ వెళ్లింది. దాని వెనకాలే గాండ్రిస్తూ వెళ్లిన పులి సైతం కంటపడటంతో పర్యాటకులు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు.